క్లుప్తంగా

నేడు పలు సేవా కార్యక్రమాలు

మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి

పిడుగురాళ్ల: రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించనున్నట్లు మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి శుక్రవారం తెలిపారు. శనివారం గురజాల నియోజకవర్గంలోని ఉదయం 11 గంటలకు దాచేపల్లి పట్టణంలోని సాయిబాబా గుడి వద్ద గల వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో అలాగే మధ్యాహ్నం 12 గంటలకు పిడుగురాళ్ల పట్టణంలోని పార్టీ కార్యాలయంలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి జన్మదిన వేడుకలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కేక్ కట్ చేసి, పలు సేవా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలియజేశారు.

వాతావరణ మార్పులతో జాగ్రత్తలు పాటించాలి

ఉద్యాన అధికారి మోహన్



గురజాల రూరల్: గత కొద్ది రోజులుగా వాతావరణంలో అల్పపీడనం కారణంగా మంచు ముసురు వస్తుందని రైతులు అప్రమత్తంగా ఉండి జాగ్రత్తలు పాటించాలని ఉద్యానవన అధికారి మోహన్ సూచించారు. మండల పరిధిలోని పులిపాడు గ్రామంలో మిరప పంటలను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మిరప పూత, పిందె దశల్లో ఉందని తామర పురుగు రాకుండా రైతులు నివారణ చర్యలు చేపట్టాలని వివరించారు. తెల్లనల్లి, తెల్లదోమ, పేనుబంక వంటి వ్యాధులు పంటకు సోకకుండా చర్యలు చేపట్టాలన్నారు. మండల వ్యవసాయాధికారులు, ఉద్యాన వన శాఖాధికారుల సలహాలు తీసుకుని ముందుకు సాగాలన్నారు. ఈ కార్యక్రమంలో శంకర్, దినేష్ కుమార్, రైతులు పాల్గొన్నారు.

అయ్యప్ప నామస్మరణతో పులకించిన రెంటచింతల

రెంటచింతల: మండల కేంద్రమైన రెంటచింతలలోని ఆంజనేయస్వామి మాణ్యం కాలనీ గురువారం రాత్రి హరిహర పుత్రుడు అయ్యప్ప నామస్మరణతో పులకించిపోయింది. గ్రామంలో అయ్యప్ప మాలలు ధరించిన భక్తులు, గ్రామస్తులు పడిపూజ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. గురుస్వామి గుంటుపల్లి ఆంథోని వరప్రసాద్ నేతృత్వంలో ఏర్పాటు చేసిన ఈ పడిపూజ మహోత్సవంలో అనీల్‌శర్మ అయ్యప్పస్వామికి 21 రకాల అభిషేకాలతో పాటు వివిధ రకాల పూజా కార్యక్రమాలు చేపట్టారు. మాలధారులు అయ్యప్ప నామస్మరణ, అయ్యప్ప జీవిత చరిత్రకు సంబంధించిన పాటలతో హోరెత్తించారు. అయ్యప్ప భజనతో భక్తులు తన్మయత్వం చెందారు. శరణు ఘోషలతో ఆ ప్రాంతమంతా భక్తిభావం నెలకొంది. అయ్యప్ప మండపం, 18 మెట్లు విశేషంగా గ్రామస్తులను ఆకర్షించాయి. మాలధరించిన స్వాములకు భిక్షను ఏర్పాటు చేశారు.

విద్యుత్ బిల్లులు దహనం

మాచర్ల రూరల్: రాష్ట్ర ప్రభుత్వం పెంచిన విద్యుత్ చార్జీలను నిరసిస్తూ శుక్రవారం మాచర్ల మండలంలోని భైరవునిపాడులో విద్యుత్ బిల్లులను సీపీఎం కార్యదర్శి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి నాయకులు అధికారంలోకి వస్తే విద్యుత్ చార్జీలు పెంచమని చెప్పి వినియోగదారులపై భారం వేసి మోసం చేశారని విమర్శించారు. ప్రభుత్వం వెంటనే స్మార్ట్ మీటర్లను బిగించకుండా ఆపాలని పెంచిన విద్యుత్ చార్జీలను తగ్గించాలని డిమాండ్ చేశారు. జింకల శ్రీను, జక్రయ్య, ప్రజలు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



పిడుగురాళ్ల: రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలోని బ్రాహ్మణపల్లి హైస్కూల్ సమీపంలో శుక్రవారం రాత్రి జరిగింది. పట్టణ సీఐ శ్రీరాం వెంకట్రావు తెలిపిన వివరాల ప్రకారం పిడుగురాళ్ల పట్టణానికి చెందిన గొంది వినోద్, ధీకొండ వెంకటేశ్వర్లు ద్విచక్ర వాహనంపై దాచేపల్లి వైపు వెళ్తుండగా బ్రాహ్మణపల్లి హైస్కూల్ సమీపంలో హైవే పక్కనే ఉన్న మార్జిన్‌లోని రైలింగ్‌కు ద్విచక్ర వాహనం అదుపు తప్పి ఢీకొనటంతో గొంది వినోద్(30)కు తీవ్ర గాయాలు కాగా చికిత్స కోసం పట్టణంలోని ఓ ప్రైవేటు వైద్యశాలకు తరలిస్తుండగా మార్గం మధ్యలో మృతి చెందాడు. కాగా ధీకొండ వెంకటేశ్వర్లుకు స్వల్ప గాయాలయ్యాయని సీఐ తెలిపారు. ఘటనా స్థలానికి చేరుకొని ఎస్‌ఐ శివనాగరాజు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

కల్లాల్లోనే ధాన్యం.. ఆందోళనలో రైతులు

అల్పపీడన ప్రభావంతో మారిన వాతావరణం

గురజాల : ఆరుగాలం కష్టించి పండించిన పంట ఇంటికి చేరుతుందో లేదో... గిట్టుబాటు ధర లభిస్తుందో లేదోనని రైతులు ఆందోళన చెందుతున్నారు. కోసిన ధాన్యపు రాశులు కల్లాల్లోనే ఉండిపోయాయి. అల్పపీడనం కారణంగా వాతావరణంలో ఒక్కసారిగా మార్పు రావడంతో రైతుల గుండెల్లో ఆందోళన మొదలైంది. వాతావరణ మార్పుతో ఎప్పుడు వర్షం వస్తుందోనని అన్నదాతలు అల్లాడుతున్నారు. రైతులు పండించిన పంటను అమ్ముకుని సొమ్ము చేసుకోవాలనే ఆలోచనతో ముందస్తు ప్రణాళికలు రూపొందించుకున్నప్పటికీ ప్రకృతి అనుకూలించడం లేదని చివరికి పెట్టిన పెట్టుబడి చేతికందివస్తుందో లేదోనని రైతులు వాపోతున్నారు. వరి పంట కోత కోసి కల్లాల్లో ఆరబెట్టిన ధాన్యపు రాశులు ప్రస్తుతం ఇంటికి వస్తాయో లేదోనని వరి రైతులకు కంటిమీద కునుకు లేకుండా పోయింది.



బస్తాల్లో నింపి ఉంచిన వరి ధాన్యం



కల్లాల్లో ఆరబోసిన ధాన్యపు రాశులను బస్తాల్లోకి ఎత్తుతున్న కూలీలు

నియోజకవర్గంలో వరి సాగు వివరాలు ఇలా...

గురజాల నియోజకవర్గంలోని గురజాల, దాచేపల్లి, మాచవరం, పిడుగురాళ్ల మండలాల్లో వరిసాగు విస్తీర్ణం ఖరీఫ్ సాగు గతంతో పోల్చితే ఈ ఏడాది పెరిగిందనే చెప్పవచ్చు. గురజాల నియోజకవర్గంలోని నాలుగు మండలాల పరిధిలో 5,620 హెక్టార్లలో ఖరీఫ్ కింద వరిసాగు చేపట్టారు. గురజాలలో 2,851, దాచేపల్లి-281, మాచవరం-499, పిడుగురాళ్ల-1,989 హెక్టార్లలో వరిసాగు చేసినట్లు వ్యవసాయ శాఖ అధికారులు వెల్లడించారు.

70 శాతం కోతలు పూర్తి

నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో 5,620 హెక్టార్లకు గాను 70 శాతం మేరకు కోతలు ఇప్పటికే పూర్తయ్యాయి. కోత కోసిన ధాన్యం సైతం కల్లాల్లోనే ఉన్నాయి. అల్పపీడనం కారణంగా వాతావరణంలో మార్పులు రావడంతో రైతులు వారి పంటను కాపాడుకునేందుకు ఉరుకులు పరుగులు పెడుతూ ధాన్యం రాశులను బస్తాల్లోకి ఎత్తుతున్నారు. అలాగే కోత దశలో ఉన్న వరి పంట రైతులు ఈ సమయంలో వర్షం వస్తే తీవ్ర నష్టం వాటిల్లుతుందని ఆందోళనకు గురవుతున్నారు. వరుణదేవా మా పంటను కాపాడుకునేలా అవకాశం కల్పించవయ్యా.. అంటూ వేడుకుంటున్నారు.

జాగ్రత్తలు చేపట్టాలి



అల్పపీడనం కారణంగా వాతావరణంలో మార్పులు రావడంతో కోత కోసిన పంటను రైతులు జాగ్రత్తగా భద్రపరుచుకోవాలి. ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు పాటించి చేతికందివచ్చిన పంటను సురక్షితంగా ఉంచుకోవాలి. చిన్న పాటి చినుకు పడినా ఇబ్బందులు వస్తాయి. రైతులు వ్యవసాయాధికారుల సూచనలు తీసుకుని అప్రమత్తంగా ఉండాలి.

– శ్రీకృష్ణదేవరాయలు, ఏడీఏ, పిడుగురాళ్ల

అలుగుమల్లెపాడులో రెవెన్యూ సదస్సు



దాచేపల్లి: నగర పంచాయతీ పరిధిలోని అలుగుమల్లెపాడులో శుక్రవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. తహసీల్దారు వై.వి.కుటుంబారావు అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో భూ సమస్యలపై రైతుల నుంచి 8 అర్జీలు స్వీకరించారు. భూ సమస్యలపై రైతులు అధికారులకు వివరించారు. రెవెన్యూ సదస్సులో వచ్చిన రైతుల సమస్యలు సత్వరమే పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని తహసీల్దారు కుటుంబరావు తెలిపారు. సదస్సులో మండల సర్వేయర్ శ్రీనివాసరావు, ఆర్ఐ శరత్‌కుమార్ తదితరులు ఉన్నారు.

మండల అభివృద్ధికి ప్రజా ప్రతినిధులు కృషి చేయాలి



మాచవరం: మండల అభివృద్ధికి ప్రజా ప్రతినిధులు కృషి చేయాలని ఇన్‌చార్జి ఎంపీడీఓ వెంగళరావు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ దారం అమ్ములమ్మ అధ్యక్షతన మండల పరిషత్ సర్వసభ్య సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటికే గ్రామాల్లో సుస్థిర అభివృద్ధిపై ప్రజా ప్రతినిధులు, అధికారులకు అవగాహన, శిక్షణ కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు. తాగునీరు, పారిశుద్ధ్యం, అభివృద్ధి కార్యక్రమాలకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. అధికారులు ఆయా ప్రభుత్వ శాఖల పనితీరును, చేపడుతున్న కార్యక్రమాల వివరాలను తెలియజేశారు. సమావేశంలో జెడ్పీటీసీ జివ్వెనబోయిన శివాయాదవ్, తహసీల్దార్ క్షమారాణి, మండల కో ఆప్షన్ మెంబర్ మహమ్మద్ జానీ, ఎంపీటీసీలు, సర్పంచులు, అధికారులు పాల్గొన్నారు.

అమిత్ షాపై చర్యలు తీసుకోవాలి

పిడుగురాళ్ల: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోం మంత్రి అమిత్ షాను వెంటనే అరెస్టు చేయాలని సీపీఎం మండల కన్వీనర్ తెలగపల్లి శ్రీనివాసరావు అన్నారు. పట్టణంలోని పిల్లుట్ల రోడ్డులో ఉన్న అంబేడ్కర్ విగ్రహం వద్ద సీపీఎం, సీపీఐ, కేవీపీఎస్ ఆధ్వర్యంలో నల్ల కండువాలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం కేంద్రంలో అధికారంలో చేపట్టినప్పటి నుంచి దళితులు, గిరిజనులు, మైనార్టీలపై దాడులు జరుగుతున్నాయన్నారు. రాజ్యాంగాన్ని ధ్వంసం చేసే ప్రయత్నంలో భాగంగానే అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేశారని విమర్శించారు. అమిత్ షాను మంత్రి పదవి నుంచి తొలగించి, క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. సీపీఎం మండల కార్యదర్శి శ్రీనివాసరావు, సీపీఐ పట్టణ కార్యదర్శి కృష్ణనాయక్, సీపీఎం నాయకులు వెంకటేశ్వర్లు, భిక్షాలు, ముక్కంటి, రాఘవులు, చిన్న, కనకారావు, వెంకయ్య, రామయ్య, రామకృష్ణ పాల్గొన్నారు.



అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఎం, సీపీఐ, కేవీపీఎస్ నాయకులు

అమిత్ షాను మంత్రి పదవి నుంచి తొలగించాలి

దాచేపల్లి: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ అంబేడ్కర్ పట్ల అవమానకరంగా మాట్లాడిన కేంద్ర మంత్రి అమిత్ షాను తక్షణమే మంత్రి పదవి నుంచి తొలగించాలని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల నాయకులు డిమాండ్ చేశారు. నారాయణపురంలో శుక్రవారం జరిగిన విలేకరుల సమావేశంలో అమిత్ షా వ్యాఖ్యలను వారు ఖండించారు. అంబేడ్కర్ మహోన్నత వ్యక్తి అని, రాజ్యాంగాన్ని రాసిన మహానుభావుడన్నారు. సమావేశంలో నాయకులు షేక్ జాకీర్‌హుస్సేన్, పి.సుధీర్, కరుణాకర్, కొండలరావు, సుగుణరావు, శ్రీనివాసరావు, దానియేలు, బాబు, మరియానందం పాల్గొన్నారు.

విద్య ద్వారానే అభివృద్ధి

దుర్గి: విద్య ద్వారానే పేద వర్గాల అభివృద్ధి జరుగుతుందని, సామాజిక అసమానతలు రూపుమాపటానికి విద్య అవసరమని, దళితులు పేద వర్గాల విద్యాభివృద్ధికి కార్డ్స్ సంస్థ కృషి చేస్తుందని సంస్థ డిప్యూటీ డైరెక్టర్ తాళ్ళూరి అమర్నాథ్ అన్నారు. శుక్రవారం కార్డ్స్ సంస్థ దుర్గి ఇందిరమ్మ కాలనీలో బాలబాట కార్యక్రమం నిర్వహించింది. ఈ సందర్భంగా దళిత బహుజన సంక్షేమ సేవా సంఘం వ్యవస్థాపకులు, రాష్ట్ర అధ్యక్షులు కుక్కమూడి ప్రసాద్ మాట్లాడుతూ మాచర్ల, వెల్దుర్తి, దుర్గి ప్రాంతాల్లో విద్యకు దూరమైన పిల్లలను గురుకుల పాఠశాలలో చేర్చే విధంగా కృషి చేయటం ప్రశంసనీయమని అన్నారు. కలివెల సైమన్ మాట్లాడుతూ బాలబాట ద్వారా డీఓలందరూ ఉన్నతంగా చదివి జ్ఞానాన్ని పెంపొందించుకున్నారన్నారు. ప్రదీప్‌కుమార్ అందరికీ క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. ఆర్‌సీఓ పేరుపోగు ప్రసాద్, ఏసీఓ కుక్కమూడి ప్రమీలలు మాట్లాడారు. 25 మంది డీఓలకు బట్టలు పంపిణీ చేశారు.

నెలాఖరులోగా బీమా ప్రీమియం చెల్లించాలి



మాచవరం: పంటలు సాగు చేస్తున్న రైతులు ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజనను సద్వినియోగం చేసుకోవాలని ఫ్యూచర్ జనరల్ టోటల్ ఇన్సూరెన్స్ సొల్యూషన్స్ కో ఆర్డినేటర్ జి.సురేష్ తెలిపారు. మండల కేంద్రం మాచవరంలో శుక్రవారం పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ రబీలో వరి సాగు చేయనున్న రైతులు ఈ నెలాఖరులోగా ఎకరాకు రూ.630 ప్రీమియం చెల్లించాలని తెలిపారు. గ్రామానికి చెందిన గొవర్తి కృష్ణ వరి పొలంలో పంట కోత ప్రయోగం చేపట్టారు. 25 చ.మీ. వెడల్పులో నూర్పిడి చేయగా 15.250 కిలోల దిగుబడి రాగా, ఎకరాకు 30 నుంచి 32 బస్తాల వరకు దిగుబడి వస్తుందని అంచనా వేశారు. ఉద్యాన సహాయకులు కరుణకుమారి, వ్యవసాయ సహాయకులు నర్సయ్య, రైతులు పాల్గొన్నారు.

గుండ్లపాడులో మార్మోగిన అయ్యప్ప శరణు ఘోష

వెల్దుర్తి: మండలంలోని గుండ్లపాడులో 60 మంది అయ్యప్ప మాలధారులు శుక్రవారం శబరిమలకు తరలివెళ్లారు. 41 రోజుల క్రితం అయ్యప్ప మాల ధరించి అత్యంత నిష్ఠతో, భక్తిశ్రద్ధలతో స్వామి వారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించి, అనంతరం స్వామి వారిని దర్శించుకునేందుకు కేరళ వెళ్లేందుకు గ్రామంలోని శివాలయం గురుస్వామి ఆధ్వర్యంలో ఇరుముడులను కట్టించుకొని ఊరేగింపుగా బయలుదేరారు. భారీ అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. అయ్యప్ప స్వామి భక్తులు గ్రామంలో ఊరేగింపు నిర్వహిస్తున్న సమయంలో మహిళలు కోలాట ప్రదర్శన చేశారు. భక్తులందరూ శరణు ఘోషతో పాటలు పాడుకుంటూ, నృత్యాలు చేస్తూ గ్రామ పురవీధుల్లో ఘనంగా ఊరేగింపు నిర్వహించారు. అయ్యప్ప మాలధారులతో పాటు ఆంజనేయ, శివ, భవానీ మాలధారులు కలిసి నృత్యాలు చేస్తూ ఊరేగింపు నిర్వహించారు.



ఊరేగింపుగా తరలివెళ్తున్న మాలధారులు

గ్రామాల అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

ఎంపీపీ గార్లపాటి అనసూర్య

పిడుగురాళ్ల: సర్వసభ్య సమావేశమంటే ప్రజా ప్రతినిధులు, అధికారుల మధ్య సమన్వయంతో గ్రామ పంచాయతీల అభివృద్ధి కోసం జరిగేది. అలాగే ఎంపీపీ, జెడ్పీటీసీ, కేంద్ర, రాష్ట్రాల నుంచి వచ్చే నిధులతో ఆయా గ్రామాల్లో అభివృద్ధి పనులు చేయాల్సి ఉంది. అయితే ఇక్కడ అధికారులు, సర్పంచ్‌లకు సఖ్యత కొరవడినట్లు కొట్టొచ్చినట్లు కనిపించింది. పిడుగురాళ్ల మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఉదయం 11 గంటలకు ఎంపీపీ గార్లపాటి అనసూర్య అధ్యక్షతన శుక్రవారం నిర్వహించారు. ఈ సమావేశానికి రెవెన్యూ, విద్యుత్, ఎక్సైజ్, హార్టికల్చర్, ఐసీడీఎస్, పోలీస్ శాఖల అధికారులు డుమ్మా కొట్టారు. పంచాయతీ రాజ్, ఆర్‌డబ్ల్యూఎస్, ఉపాధి హామీ, హౌసింగ్, ఆరోగ్య శాఖ అధికారులు మాత్రమే హాజరయ్యారు. గ్రామాల్లో అభివృద్ధి, ప్రజల సమస్యలు పరిష్కరించేందుకు సర్వసభ్య సమావేశం దోహదపడుతుందని అటువంటి సమావేశాలకు అధికారులు, ప్రజా ప్రతినిధులు రాకపోవటం వారి మధ్య సఖ్యత లేదని తెలుస్తుందని ఈవోపీఆర్‌డీ భీమినేని దయాసాగర్ బహిరంగంగానే చెప్పటం విశేషం. ఎంపీపీ గార్లపాటి అనసూర్య మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని పేర్కొన్నారు. సమావేశాలకు అన్ని శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు తప్పనిసరిగా హాజరు కావాలని చెప్పారు. ఎంపీడీవో ఆర్.రామచంద్రమూర్తి మాట్లాడుతూ గ్రామాల్లో జరిగిన పనుల ప్రోగ్రెస్ వివరాలు ప్రజా ప్రతినిధులకు చెప్పాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. సమావేశానికి హాజరు కాని అధికారులకు మెమోలు జారీ చేస్తామన్నారు. వైస్ ఎంపీపీ సాతులూరి బాబు, మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షులు తాటికొండ చిన్న ఆంజనేయులురెడ్డి, పలు శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.



సర్వసభ్య సమావేశానికి హాజరైన అధికారులు

ఇంధన పొదుపుపై అవగాహన

మాచర్ల : జాతీయ ఇంధనపు పొదుపు వారోత్సవాల్లో భాగంగా మాచర్ల టౌన్‌లోని జెడ్పీ బాలికల హైస్కూల్‌లో ఇంధన పొదుపుపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలు శుక్రవారం నిర్వహించారు. ఇంధన పొదుపుపై అవగాహన కల్పించారు. విద్యుత్ శాఖ ఏఈ ఎస్.సింగయ్య విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బంది, విద్యార్థులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

జాబ్ మేళాలో 45 మందికి ఉద్యోగాలు

పిడుగురాళ్ల: నిరుద్యోగులకు జాబ్ మేళా చాలా ఉపయోగకరంగా ఉంటుందని పల్నాడు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి తమ్మాజీరావు అన్నారు. పట్టణంలోని జూనియర్ కళాశాల ప్రాంగణంలో శుక్రవారం జాబ్‌మేళా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 45 మందికి ఉద్యోగ అవకాశాలు వచ్చాయని ఆయన తెలిపారు. ప్రిన్సిపాల్ కృష్ణారెడ్డి మాట్లాడుతూ ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ జాబ్ మేళాను పిడుగురాళ్ల పట్టణంలో నిర్వహించటం సంతోషకరమని అన్నారు. ఉద్యోగ అవకాశాలు పొందిన వారికి నియామక పత్రాలను అందజేశారు. వైస్ ప్రిన్సిపాల్ బాబురావు, నైపుణ్యాభివృద్ధి సంస్థ సిబ్బంది, జిల్లా ఉద్యోగ కల్పనాధికారి, పిడుగురాళ్ల స్కిల్ హబ్ కో ఆర్డినేటర్, సీడాప్ రిసోర్స్ పర్సన్ పాల్గొన్నారు.

నేడు సర్వసభ్య సమావేశం

రెంటచింతల: స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో శనివారం సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు మండల అభివృద్ధి అధికారి కె.సరోజినిదేవి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటలకు నిర్వహిస్తున్న ఈ సమావేశంలో జెడ్పీటీసీ, ఎంపీపీ, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, అధికారులు పాల్గొనాలని కోరారు.